

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం,11 ఆగస్టు 2025

8 పేజీలు


## క్రీడలు వ్యక్తిగత
# క్రమశిక్షణ నేర్పుతాయి




### -ఎమ్మెల్యే రాజప్ప


**పెద్దాపురం,మేజర్‌న్యూస్** : పెద్దాపురం రామారావు పేటలో గల శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో 9-8-2025 నుండి 12-5-2015 వరకు జరుగుచున్న సి.బి.యస్. క్లస్టర్-VII బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్ 2025 పోటీలలో రెండవ రోజు ఆదివారం క్రీడాకారులతో ముఖాముఖి మాట్లాడివారిని ఉత్తేజ పరచడానికి పెద్దాపురంశాసన సభ్యులు నిమ్మకాయల చిన రాజప్ప, మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజసూరిబాబు రాజులు విచ్చేసారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడతూ ఏ క్రీడ అయినా సరే క్రీడాకారులకు వ్యక్తిగత క్రమశిక్షణ నేర్పుతుందని, కాబట్టి ప్రతీ విద్యార్థి కూడా ఏదో ఒక క్రీడలో రాణించాలని దాని కోసం శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాల వంటిది ఎప్పుడు ముందుంటాయని పేర్కొన్నారు. రాజా సూరిబాబు రాజు మాట్లాడుతూ క్రీడల వలన శారీరక ధారుఢ్యం తో పాటు,మానసిక ధారుఢ్యం కూడా పెరుగుతుందని క్రీడలో ఓడినా గెలిచినా క్రీడాస్ఫూర్తిని ప్రకటించాలని అభిలాషించారు. శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాల డైరెక్టర్ సిహెచ్. విజయ్ ప్రకాష్‌మాట్లాడుతూ సి.బి.యస్.యి. కస్టర్-VII బాస్కెట్‌బాల్ పోటీలు బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆప్ ఇండియా జాయింట్ సెక్రెటరీజి.చక్రవర్తి ఆధ్వర్యంలో ఎంతచక్కగా నిర్వహింప బడుతున్నాయని మధ్య మధ్యవర్షం కారణంగా అంతరాయం కలుగుతున్నప్ప టికి దానికి సంబంధిం చిన ఏర్పాట్లు చేయడం వలన పోటీలు నిరంతరాయంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో క్రీడాకారులు, పాఠశాల అధ్యాపక బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 11 సోమవారం -
# పీజీఆర్ఎస్ కార్యక్రమం యథాతథంగా

**-1100 కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదుల పరిష్కార వేదిక**
**-9552300009 వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సేవలు అందుబాటులో - కలెక్టర్ పి.ప్రశాంతి**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్** : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా నిర్వహించే పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార) కార్యక్రమం ఈ నెల ఆగస్టు 11వ తేదీ సోమవారం యథావిధిగా నిర్వహించబడుతుందని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ శ్రీమతి పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమఅర్జీలను డివిజన్, మండల కేంద్రాల కార్యాలయాల్లోనే సమర్పించవచ్చని తెలిపారు.జిల్లా కేంద్రానికి ప్రత్యేకంగా రావాల్సిన అవసరం లేకుండా స్థానికంగా అధికారులు సేవలు అందిస్తారని, దీని వల్ల ప్రజలకు సమయం మరియు ఖర్చుఆదా అవుతుందని చెప్పారు.అర్జీల స్వీకరణ ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు జరుగుతుంది. ప్రజలు “మీ కోసం” 1100కాల్ సెంటర్ ద్వారా కొత్తఫిర్యాదులు నమోదు చేయడంతో పాటు, ఇప్పటికే నమోదు చేసిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని కూడా తెలుసుకోవచ్చని తెలిపారు. అలాగే వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 9552300009 ద్వారా పౌర సేవలు పొందవచ్చని, ఈనంబర్‌ను తమ సెల్‌ఫోన్లలో సేవ్ చేసుకోవాలని సూచించారు. నేరుగా హాజరు కాలేకపోయిన వారు meekosam.ap.gov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో అర్జీలు నమోదు చేసుకునే వీలుందని తెలిపారు. ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న ఈ వినూత్న మాధ్యమాలను ఉపయోగించి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు.



# ఈ నెల 12న స్వర్గీయ ఎన్టీ రామారావు
# నూతన విగ్రహావిష్కరణ

**- సినీ హీరో నారా రోహిత్, మంత్రి సుభాష్ చేతుల మీదుగా**

**రామచంద్రపురం,మేజర్‌న్యూస్** : ఈనెల 12న ఉదయం 10:30 గంటలకు సమాజమే దేవాలయం..ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించి, తెలుగువారి గుండెల్లో తనదైన ముద్ర వేసుకున్న విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం రామచంద్రపురంలో జరుగుతుందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం తెలిపారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సుమారు తొమ్మిది లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటుచేసిన నందమూరి తారకరామారావు విగ్రహ ఆవిష్కరణకు యువ నాయకులు,

- తరువాయి 2లో..

# ర్యాలీలో బీటలు వారుతున్న పశు వైద్యశాల

**- నిర్మాణ పనుల్లో నాణ్యతకు నీళ్లు**
**- కోట్ల రూపాయలు ప్రభుత్వ నిధులు నీళ్ల పాలు**





**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్** : కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలుఇంజనీరింగ్ అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్లు అవినీతితో కొద్ది కాలానికి బీటలు వారుతున్నాయి. మండల పరిధిలోని ర్యాలి గ్రామంలో సుమారు కోటి రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ పశువైద్యశాల ఏడాది పూర్తికాకుండానే బీటలు వారుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్యశాలను మెరుగైన సౌకర్యాలతో నిర్మించాలనే సంకల్పంతో 2023లోర్యాలీగ్రామంలో కోటి రూపాయలు తో పశువుల వైద్యశాల నిర్మించారు. అయితే ఏడాదిన్నర కాకుండానే పునాది కృంగిపోయి లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన టైల్స్ పూర్తిగా ధ్వంసం అయ్యాయి.భవననిర్మాణ సమయంలో ఇంజనీరింగ్ అధికారులు నాణ్యత ప్రమాణాలు పట్టించుకోకపోవడం, కాంట్రాక్టర్లు ఇష్టనుసారంగా నిర్మాణ పనులు చేపట్టడంతోనే ఈ దుస్థితి ఏర్పడిందని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. పశువులకు వైద్యం అందించేందుకు పశువులను తీసుకువచ్చిన పశు పోశకులు వాటికి సేవలందించేందుకు పశువైద్య సిబ్బంది బీటలు వారిన ఫ్లోరింగ్‌పై పశు వైద్యశాలలో

- తరువాయి 2లో..

# రూరల్ మండలంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ




**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్** : జిల్లా కలెక్టర్ ఆదేశాలు మరియు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు మేరకు, రాజమండ్రి డివిజన్ పరిధిలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టడం జరుగుతోందని ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్ తెలిపారు.ఆదివారం, రాజమండ్రి రూరల్ మండలంలో మండల స్థాయి హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆగస్టు 15న జరగబోయే 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఆగస్టు 2 నుంచి 15 వరకు వివిధ కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు.

ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తి, జాతీయ స్ఫూర్తిని పెంపొందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి తహసిల్దార్ శ్రీనివాస్, ఇంచార్జి ఎంపిడివో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# గీత కార్మికుల అభివృద్ధికి సి ఎం చంద్రబాబు కృషి





**ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్**

**గీత కార్మికులకు 10 శాతం రిజర్వేషన్లు చారిత్రక అధ్యాయం**

**: డా.దాసరి శ్యామ్ చంద్ర శేషు**

**కామవరపుకోట, మేజర్ న్యూస్ :** రావికంపాడు గ్రామంలో సర్పంచ్ వేముల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బీసీల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలోనే ఎవరూ చేయని విధంగా కూటమి ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గీత కార్మికుల సహా చేనేత నాయి బ్రాహ్మణ మత్స్యకార అనేక బీసీ కులాలకు పెద్దపీట వేస్తూ వారి రాజకీయ ఆర్థిక అభివృద్ధికి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. మునిపెన్నడూ లేనివిధంగా 47 వేల కోట్ల రూపాయల నిధులను బడ్జెట్లో కేటాయించి బీసీలపై ఆయనకున్న చిత్తశుద్ధిని తెలియజేశారని, ప్రతిపక్షంలో ఉండగా టిడిపి, జనసేన అధినేతలు ఇచ్చినటువంటి హామీలను నేడు అధికారంలోకి వచ్చాక అమలుపరుస్తున్నారని అన్నారు.గీత కులాలకు 10 లక్షల రూపాయలు ప్రమాదబీమా, 50 ఏళ్లకే పెన్షన్, ప్రమాదవశాత్తు అంగవైకల్యం నుంచి వయసుతో సంబంధం లేకుండా పెన్షన్ ఇవ్వడం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. దాంతోపాటు మద్యం షాపుల్లో బార్ల లైసెన్స్‌లో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేటాయింపులు చేయడం ఈ కులాల పట్ల ముఖ్యమంత్రికి ఉన్న చిత్తశుద్ధి తెలియజేస్తుందని అన్నారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు మాట్లాడుతూ గతంలో ప్రతిపక్ష నేతగా ఈ ప్రాంతానికి విచ్చేసిన చంద్రబాబు నాయుడు అప్పుడు ఇక్కడ ఇచ్చినటువంటి హామీ ప్రకారం గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించడంతోపాటు ఫీజులో కూడా ఫీజులో కూడా 50 శాతం రాయితి ఇవ్వడం, అదేవిధంగా ఇప్పుడు విడుదల చేసిన బార్ల లైసెన్స్‌లో కూడా 50 శాతం ఫీజు రాయితీతో పాటు 10 శాతం కేటాయింపులు చేయడం గీత కార్మికుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఉన్న హితోదికమైన ప్రేమను తెలియజేస్తుందని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే గంటా మురళి రామకృష్ణ మాట్లాడుతూ బీసీలు అంటే తెలుగుదేశం అని తెలుగుదేశం అంటే బీసీలని తెలుపుతూ బీసీలు ఎల్లప్పుడూ తెలుగుదేశం కోసం పనిచేస్తే తెలుగుదేశం బీసీల ఆర్థిక అభివృద్ధి కోసం పని చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టబోయిన రామలింగేశ్వర రావు మండల పార్టీ అధ్యక్షుడు ఏలూరి హరి సీనియర్ నాయకులు కోనేరు సుబ్బారావు సొయిలు సత్యనారాయణ పిల్లల శ్రీనివాస్ యాదవ్ బోసా సత్యనారాయణ తూటికుంట దుర్గారావు డోలా విజయ్ జనసేన నాయకులు చాణక్య విజయ్ మారిశెట్టి చిట్టెమ్మ భారతి తూటికుంట రాము కొప్పెర్ల నాగరాజు హనుమంతు కొనకళ్ళ రాజు శ్రీనివాస్ యాదవ్ సత్య యాదవ్ తదితరులు ప్రసంగించారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం గీత కార్మికులను ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ ఆధ్వర్యంలో సత్కరించారు.

# 'దేశం, నేత నాయుడును మర్యాదపూర్వకంగా కలిసిన ఏఎంసీ చైర్మన్



**నరసాపురం, మేజర్‌న్యూస్ :**తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి,కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు ని ఇటీవలే నూతనంగా నియమితులైన పాలకొల్లు ఏఎంసి చైర్మన్ కోడి విజయభాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు.శనివారం నరసాపురం నాయుడు స్వగృహంలో ఈ కార్యక్రమం జరిగింది. విజయ భాస్కర్‌ను నాయుడు శాలువాతో సత్కరించారు. మరింత ఉన్నత స్థితి అభివృద్ధి కావాలని ఆయన ఆకాంక్షించారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి ఎప్పుడు గుర్తింపు ఉంటుందని, చంద్రబాబు నాయుడు కష్టపడే వారికి ప్రాధాన్యతను ఇస్తారని నాయుడు అన్నారు. ఈ సందర్భంగా నరసాపురం,పాలకొల్లు నియోజకవర్గాలలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సంకు భాస్కర్ నాయుడు,చామకూరి బ్రదర్స్,లక్కు శ్రీను,బందారు మోహన్ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నడిగుడిలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి : నలుగురి అరెస్టు



**కుక్కునూరు, మేజర్‌న్యూస్:** కుక్కునూరు మండలం నడిగుడి గ్రామములో పేకాట స్థావరంపై కుక్కునూరు ఎస్ఐ రాజా రెడ్డి వారి సిబ్బందితో కలిసి దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుండి నగదు స్వాధీనం చేసుకున్నారు.పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు, కుక్కునూరు ఇన్స్పెక్టర్ ఎం. రమేష్ ఆధ్వర్యంలో, కుక్కునూరు ఎస్ఐ రాజా రెడ్డి సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు.ఎస్ఐకి రాబడిన సమాచారం పై కుక్కునూరు మండలం నడిగూడెం గ్రామ శివారులోని అడవి ప్రాంతంలో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి నలుగురిని వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 21 వేల నగదు స్వాధీనం చేసుకుని, వారి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజా రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ రాజా రెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, ఎవరైనా ఇలాంటి కార్యకలాపాలను గమనించినప్పుడు వెంటనే డయల్ 112కి సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని కుక్కునూరు ఎస్సై రాజా రెడ్డి పేర్కొన్నారు.

## నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' నిర్వహణ

**- ఆర్డీఓ శ్రీరమణి**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** సోమవారం పెద్దా పురం ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహణ జరుగు తుందని, ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. కావున డివిజన్‌లోని 11 మండలాల పరిధిలో గల ప్రజలు ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సద్వినియోగం చేసుకోవలసినదిగా ఆమె తెలిపారు.

# ర్యాలీలో బీటలు వారుతున్న పశు వైద్యశాల

**మొదటిపేజి తరువాయి**

తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పునాది పనులు నిర్వహించిన కాంట్రాక్టర్‌తో తిరిగి మరమ్మతులు చేపట్టించాలని రైతులు కోరుతున్నారు. అలాగే పశు వైద్యశాల చుట్టూ పిచ్చి మొక్కలు, చెత్త చెదారాలు పేరుకుపోయి పశువైద్యశాలలో అపరిశుభ్రత తాండవించి విష సర్పాలు సంచరిస్తున్నాయని పశుపోషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ర్యాలీ పశు వైద్యశాలలో పరిశుభ్రత వాతావరణం ఏర్పాటుచేసి, మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఈ నెల 12న స్వర్గీయ ఎన్టీ రామారావు నూతన విగ్రహావిష్కరణ

**మొదటిపేజి తరువాయి**

ప్రముఖ సినీ హీరో నారా రోహిత్, మంత్రి సుభాష్‌లు హాజరై వారి చేతుల మీదుగా ఆవిష్కరణ జరుగుతుం దన్నారు. ఈ మహోన్నత కార్యక్రమానికి కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఈనెల 12న మంగళవారం ఉదయం 10:30 గంటలకు రామచంద్రపురం బైపాస్ సెంటర్ పసలపూడి వద్దకు తరలిరావాలని పిలుపునిచ్చారు. పేదలకు పింఛన్ సౌకర్యం, కిలో రెండు రూపాయలకే బియ్యం ప్రవేశపెట్టి, పాలనలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి తెలుగు ప్రజల ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ రామచంద్రపురంలో మంత్రి సుభాష్ ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తున్నామని ఒక ప్రకటనలో వెల్లడించారు. అదే రోజున ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ అనంతరం బైపాస్ రోడ్ లోని విజయ్ ఫంక్షన్ హాల్లో జరిగే "కోనసీమ యూత్ సమ్మిట్" లో ముఖ్య అతిథులు సినీ నటులు నారా రోహిత్, మంత్రి సుభాష్ లు పాల్గొంటారని వాసంశెట్టి సత్యం తెలిపారు.

# 4 సొసైటీలకు త్రిసభ్య కమిటీలు



**పాలకోడేరు, మేజర్‌న్యూస్ :** పాలకోడేరు మండలంలోని నాలుగు వ్యవసాయ సహకార సంఘాల (సొసైటీ)లకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. శృంగవృక్షం సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్ పర్సన్‌గా కలిదిండి కృష్ణంరాజు (బుజ్జి), సభ్యులుగా కదలి రంగారావు, వీరవల్లి శ్రీనివాసకుమార్, పాలకోడేరు చైర్ పర్సన్‌గా కొత్త పల్లి నాగరాజు, సభ్యులుగా యర్రా అప్పారావు, పాలా నాగ గంగాధరరావు, కుముదవల్లి చైర్ పర్సన్‌గా బుద్ధరాజు బలరామకృష్ణంరాజు, సభ్యు లుగా పి.సూర్యారావు, భూపతిరాజు మధుమోహనరాజు, విస్సాకోడేరు సొసైటీ చైర్ పర్సన్‌గా నంబూరి వెంకట రామాం జనేయవర్మ(బాలాజీరాజు), సభ్యులుగా సంగారెడ్డి విజయలక్ష్మి, బైరెడ్డి శ్రీను నియమితులయ్యారు.

# దేశ సమైక్యత, సమగ్రత కోసం ప్రతీ ఒక్కరూ పాటుపడాలి

### – బీజేపీ జిల్లా కార్యదర్శి మోదుగు పెరమయ్య



**ఎటపాక, మేజర్ న్యూస్ :** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించనున్న హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యార్థులుతో హర్ ఘర్ తీరంగా యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ కార్యకర్తలు దేశప్రజలతో కలిసి తిరంగా యాత్రలు, దేశభక్తి కార్యక్రమాలు నిర్వహిస్తూ దేశసమైక్యత, సమగ్రత కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దృఢనాయకత్వం, సాయుధ దళాల ధైర్యసాహసం, ప్రజల ఉమ్మడి ఆకాంక్షల ఫలితంగా ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా నిర్వహించడం ఆత్మనిర్భర్ భారత్ కు ఇది నిదర్శనం, ప్రతి పౌరుడికీ గర్వకారణం అని బీజేపీ రాష్ట్ర నాయకులు నోముల రామారావు ,జిల్లా కార్యదర్శి మోదుగు పెరమయ్య అన్నారు. పార్లమెంటులో ప్రధాని మోడీ పేర్కొన్నట్లుగా ఇది భారత విజయోత్సవానికి, ఆత్మగౌరవానికి సంబంధించిన సెషన్, ఉగ్రవాదుల కేంద్రాలను నేలమట్టం చేసినందుకు సిందూర్ శపథం నెరవేరిందుకు జరిగే వేడుకలన్నారు. అనంతరం విద్యార్థులుకు సత్యనారాయణమ్మ హ్యాండ్ బ్యాగ్స్ అందజేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నోముల రామారావు, కుంజం వీర వెంకట సత్యనారాయణమ్మ, జిల్లా కార్యదర్శి కామేశ్వరి, ఊకె రత్తయ్య, మేడిపల్లి కృష్ణ పాల్గొన్నారు.

## ఐడిపిపై రెండవరోజూ ఉత్సాహంగా కొనసాగిన వర్క్‌షాప్




**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఐక్యూఏసి మరియు కెపాసిటీ బిల్డింగ్ డైరెక్టరేట్, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ, కాకినాడ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఐడిపి)పై రెండు రోజుల వర్క్‌షాప్ రెండవ రోజు కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగాయి. ఉదయం 9.30గంటలకు "ఔట్‌లైన్ ఫర్ డెవలపింగ్ ఐడిపి & ఇంప్లిమెంటేషన్ స్ట్రాటజీస్" అంశంపై సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ కాశ్మీర్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఏ.రవీందర్‌నాథ్ కీలక ప్రసంగం చేశారు. అనంతరం ఉదయం 11.30గంటలకు ప్రారంభమైన "ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫ్ ఐడిపి సెల్" సెషన్ ప్రొఫెసర్ ఏ.రవీందర్‌నాథ్, ప్రొఫెసర్ గౌరీదత్ శాస్త్రి పాల్గొన్నారు. మధ్యాహ్నం 2.00 గంటలకు జరిగిన "డ్రాఫ్టింగ్ ఐడిపి" ప్యానల్ డిస్కషన్‌లో కె.వెంకటేష్ మోడరేటర్‌గా వ్యవహరించారు.రెండవ రోజు కార్యక్రమాల్లో వనరుల నిపుణుల ఆలోచనలు, అనుభవాలు మరియు అమలు చేయదగిన వ్యూహాలు పాల్గొన్న వారికి విశేష అవగాహన కలిగించాయని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జెఎన్‌టియుకె గౌరవ ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, రెక్టార్ ప్రొఫెసర్ వి.వి.సుబ్బారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావు, ఓఎస్‌డి ప్రొఫెసర్ డి.కోటేశ్వరరావు, ప్రొఫెసర్ రవీంద్ర కొల్లు, డైరెక్టర్ ఐక్యూఏసి & సిబి, ప్రొఫెసర్ బాలాజీ, డైరెక్టర్, అఫిలియేషన్స్ & లీగల్ మ్యాటర్స్, యుసిఇకె, యుసిఇఎన్ ప్రిన్సిపాల్స్, డైరెక్టర్‌లు, యుసిఇకె అధ్యాపకులు, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్ మరియు మేనేజ్‌మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



**పెద్దాపురం, మేజర్‌న్యూస్ :** పెద్దా పురం పట్టణంలో వేంచేసియున్న ఉభయ తెలుగు రాష్ట్రాల కు ప్రసిద్ది చెందిన శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారిని ఆదివారం బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ పర్యవేక్షణలో వేదపండితులు అమ్మవారి దర్శనం కల్పించి, వేద ఆశీర్వ చనాలు అందజేసి, అనంతరం ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతి వీర్, వరహాలు, లోవ, శివ తదితరులు ఉన్నారు.

# మిస్సింగ్ కేస్ చేధించిన గండేపల్లి పోలీసులు



**గండేపల్లి,మేజర్‌న్యూస్ :** రామేశ్వరంపేట గ్రామం నకు చెందిన ఒక వివాహిత,డి.రాజు అను ఆసామీ 31 జూలై న భార్యతో గొడవపడి మిస్ అవ్వడం జరిగింది. దానిపై గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో 244/2025 మెన్ మిస్సింగ్ గా కేసు నమోదు చేయడం జరిగింది. సీఐ వై ఆర్ కె శ్రీనివాస్, గండేపల్లి ఎస్సై శివ నాగబాబు మరియు సిబ్బంది అనేక రకాలుగా ప్రయత్నించి చివరకు అతనిని విశాఖ నగరం లోని కింగ్ జార్జి హాస్పిటల్ ఏరియాలో అతనిని ట్రేస్ చేయడం జరిగింది. గండేపల్లికి తీసుకొని వచ్చి అతని బంధువులకు అప్పగించినట్టు వై ఆర్ కె శ్రీనివాస్ తెలిపారు.

## కోలాహలంగా గంగానమ్మ జాతర

**ముదినేపల్లి,మేజర్‌న్యూస్:** ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో పద్మశాలి బజారులో శ్రావణమాసం ఆదివారాన్ని పురస్కరించుకొని గ్రామదేవత గంగానమ్మ తల్లి జాతర (వారాల పండుగ) కోలాహలంగా, కనులపండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు గంగానమ్మ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపుగా వెళ్ళిన యువకులు, భక్తులు నిర్వహించిన కర్రసాధన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షణీయంగా నిలి చాయి. అనంతరం బలుసులమ్మ తల్లి గుడికి ఊరేగింపుగా వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మార్ని్వతి మాధవరావు , ఇమ్మంది శ్రీనివాసరావు , దములూరి నిరంజనరావు , పందిరి శ్రీనివాసరావు, పద్మశాలి బజార్ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోడిపందాల శిబిరంపై పోలీసులు దాడి :10 మందిపై కేసు నమోదు



**ద్వారకాతిరుమల, మేజర్‌న్యూస్:** ఏలూరు డిఎస్పి డి.శ్రావణ్ కుమార్ ఆదేశాలపై భీమడోలు సిఐ యు జే విల్సన్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారక తిరుమల ఎస్ఐ సుధీర్ కి రాబడిన సమాచారం మేరకు వారి సిబ్బందితో కలిసి ద్వారక తిరుమల మండలం ఐఎస్ మలసాని కుంట గ్రామం శివారులో కోడి పందేల స్థావరంపై దాడులు నిర్వహించారు. 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 8 మోటార్ సైకిళ్లు,రూ.4,770లను స్వాధీనం చేసుకొని వారిపై ద్వారక తిరుమల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ తెలిపారు.

ఈ సందర్భంగా ద్వారక తిరుమల ఎస్ఐ సుధీర్ మాట్లాడుతూ గ్రామాలలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు అనగా కోడి పందాలు, పేకాట లు నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా కోడిపందాలు పేకాటలో నిర్వహిస్తున్నటు వంటి సమాచారాన్ని డయల్ 112 కు గాని లేదా ద్వారక తిరుమల ఎస్సై ఫోన్ నెంబర్ 9440796653 నకు సమాచారం అందించిన ఎడల చట్ట ప్రకారం జూదరులపై చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# మొట్టమొదటిగా కాకినాడలో "అంజు కంటి హాస్పిటల్"లో ఆధునిక లేసిక్ మెషీన్ ప్రారంభం





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ గైగోలుపాడులో గల అంజు కంటి హాస్పిటల్లో నూతనంగా డాక్టర్ తేజ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "ఆధునిక లేసిక్ మెషీన్" ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ,రాజ్యసభ సభ్యులు సాన సతీష్, సిటీ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వర రావు పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్బంగా కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ మాట్లాడుతూ డా.తేజ కంటి చూపు కొరకు అవగాహనా సదస్సులు, ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తూ పేదవారికి మందులు అందిస్తూ, ఆపరేషన్లు నిర్వహిస్తూ, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలకు ధీటుగా ప్రపంచ స్థాయి కంటి శస్త్ర చికిత్స సాంకేతిక పరిజ్ఞానాన్ని కాకినాడలో ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.

ఈ కార్యక్రమంలో అంజు కంటి హాస్పిటల్ మేనేజింగ్ స్టాఫ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మూన్నాళ్ళ ముచ్చట....






**- గోతులు పడుతున్న బీటీ రోడ్డు**
**- వాహన చోదకులకు తప్పని ఇక్కట్లు**
**- చేతులు దులుపుకుంటున్న కాంట్రాక్టర్**
**- చోద్యం చూస్తున్న అధికారులు**

**గండేపల్లి, మేజర్ న్యూస్ :** మూన్నాళ్ళ ముచ్చట అన్నట్లు తయారైన రహదారుల పరిస్థితి. ప్రారంభించిన రెండో నెలలోనే గోతులు పడుతున్న బీటీ రోడ్. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రహదారుల పటిష్ట కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యంతో కాంట్రాక్టర్లకు వరంగా మారుతున్నాయి. దీనికి ప్రధాన కారణం కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా రహదారుల నిర్మాణం చేపడుతుంటే మరోపక్క అధిక లోడులతో వాహనాలు రవాణాయే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వం రహదారుల పటిష్టతను పట్టించుకోకుండా వాహన శోధకుల ప్రాణాలతో ఆడుకుందని ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని రహదారుల నిర్మాణం కోట్ల రూపాయలు పెట్టించి వేగంగా చేపడుతుందని ఇది కాంట్రాక్టర్లకు అధికారులకు వరంగా మారుతుందని పలువురు ఆరోపిస్తున్నారు.

**వివరాల్లోకి వెళితే :** గండేపల్లి మండలం తాళ్లూరు 16 నెంబర్ జాతీయ రహదారి నుండి ఉప్పలపాడు పోవు మార్గం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 90 లక్షల రూపాయలు వెచ్చించి 25-1-2025 తేదీ పని ప్రారంభించగా 12-6-2025 తేదీ పల్లె పండగ సంబరంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదగా బీటీ రోడ్‌ని ప్రారంభించడం జరిగింది. కొన్ని నెలల్లోనే రోడ్డుకు వేసిన తూర దిగి గోతులు మయింగా మారి రహదారి ఛిద్రానికి గురవడం బాధాకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీటీ రోడ్డు నిర్మించే మందు చేయవలసిన పని పటిష్టతగా చేశారా? లేక తూతూ మంత్రంగా వేశారా? అన్న ప్రశ్నలు వినబడుతున్నాయి. గత ప్రభుత్వంలో రహదారి భద్రత లేక వాహనాలపై అనేక ఇబ్బందులు పడ్డామని కూటమి ప్రభుత్వంలో రహదారులు పటిష్ట పరచడంపై హర్షం వ్యక్తం చేసిన వాహన శోధకులకు మూనాళ్ళ ముచ్చట గానే మిగిలిందని పలువురు విచారం వెళ్లబుచ్చుతున్నారు. అంతేకాకుండా ప్రధాన రహదారుల నుండి గ్రామీణ ప్రాంతాలకు పోయే రహదారులపై అధిక బరువుల వాహనాలను నడపడం ద్వారా రహదారులు తొందరగా పోయే ప్రమాదం నెలకొంటుందని ఆరోపిస్తున్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి రహదారులు నిర్మిస్తుంటే ఆ రహదారుల పై పరిమితికి మించిన లోడు వాహనాలు, దుక్కి ట్రాక్టర్లు రవాణా జరుగుతుంటే రహదారి భద్రత పై అధికారులు కానరావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పరిమితికి మించిన లోడు వాహనాలను, దుక్కి టాక్టర్లు వంటి వాటిపై చర్యలు తప్పవు అని హెచ్చరికలు జారీ చేయడమేనా హెచ్చరిక జారీ చేసే అధికారులు ఎక్కడ అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పై అధికారులు స్పందించి ఈరహదారి గోతులు పడిన ప్రాంతంలో కలవర్టు పునర్నిర్మాణంచేసి పూర్తిస్థాయిలో పది కాలాల నిలిచే విధంగా చర్యలుతీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**-పంచాయతీరాజ్ జేఈ వివరణ:** బీటీ రోడ్డు కిందకు తొక్కడం వాస్తవమేనని అయితే ముందుగా అక్కడ కలవట్టు లేనందున గ్రామస్తుల అభ్యర్థన మేరకు పైఅధికారుల ఆదేశాలతో తర్వాత నిర్మాణం చేపట్టడం జరిగిందని అందువలన కలవర్టున్న ప్రదేశంలో గోతులు మాయంగా మారింది. కలవర్టుకు వేసిన తూరను తొలగించి మరల ఆ ప్రాంతంలో పటిష్టపరిచి మరలా తూరను వేస్తాం.

## ఎంపీ సానా సతీష్ బాబు కృషితో
## కాకినాడ ఆర్ఎంసి గ్రౌండ్ వాకర్స్ కోసం పునఃప్రారంభం



కాకినాడ,మేజర్‌న్యూస్ : కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ ఆర్ఎంసి గ్రౌండ్ వాకర్స్ కోసం ఆదివారం ఉదయం పునఃప్రారంభమైంది. రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు చొరవతో వాకర్స్‌కు గ్రౌండ్ వినియోగానికి అనుమతి లభించింది. గ్రౌండ్ పునఃప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీలు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ, పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు హాజరయ్యారు. సీనియర్ సిటిజన్స్, వాకర్స్, ఆర్ఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్లు అతిథులకు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా సానా సతీష్ బాబు మాట్లాడుతూ ఆర్ఎంసి గ్రౌండ్ కేవలం మైదానం మాత్రమే కాక, వేల మందికి ఆరోగ్యాన్ని అందించే ప్రదేశమని, వాకర్స్ అందరూ దీన్ని సమర్ధంగా ఉపయోగించుకోవాలని సూచించారు. వాకర్స్‌కు ప్రత్యేక ఐడి కార్డులు జారీ చేయబోతున్నట్లు తెలిపారు. అనంతరం ఐడి కార్డులను అందజేసి, వాకర్స్‌తో కలిసి వాకింగ్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్, వాకర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెంకన్న అన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి ఆదివారం నిడదవోలు మండలం కాటకోటేశ్వరంకు చెందిన బెల్లపుకొండ కృష్ణమూర్తి, వరలక్ష్మి దంపతులు రూ.1,01,116లు; పల్నాడు జిల్లా,సత్తెనపల్లికి చెందిన దేవిశెట్టి నాగేశ్వరరావు,విజయలక్ష్మి దంపతులు రూ.25,116లు విరాళంగా సమర్పించారు. వీరికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దాతలకు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్‌రావు, కూటమి నాయకులు, కాబోయే చైర్మన్ ముదునూరి వెంకటరాజు స్వామివారి చిత్రపటం అందించారు.

## ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ వద్ద ఘనంగా నిర్వహించారు.జిల్లా యుటిఎఫ్ ఆడిట్ కమిటీ కన్వీనర్ కొప్పిశెట్టి శ్రీనివాస్ పతాకావిష్కరణ చేశారు. యుటిఎఫ్ ఉపాధ్యాయ లోకానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు టి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సిహెచ్. సుధాకర బాబు, గౌరవ అధ్యక్షులు సరిదే ప్రసాద్, కోశాధికారి కడలి ప్రసాద్, సహాధ్యక్షురాలు డి.డి.లక్ష్మీదేవి, జిల్లా కౌన్సిలర్లు చిప్పాడ సత్యనారాయణ, సిహెచ్.వి.ఎల్.కె.దుర్గ, కార్యవర్గ సభ్యులు కారింకి ప్రసాద్, సానబోయిన సాయిరాం, బి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం

**- పాల్గొన్న భక్తులు**




**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు. వేదపండితులు ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాలలో వ్యక్తిత్వ వికాస కార్యక్రమం

- గీతా పఠనం సర్వ శ్రేయస్కరం
- ఇస్కాన్ స్వామిజీ అనంత శేషదాసు




**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో కాకినాడ ఇస్కాన్ వారిచే " శ్రీ భగవద్గీత ద్వారా వ్యక్తిత్వ వికాసం " అనే అంశంపై వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. విద్యార్థి యువత తమ శక్తి సామర్థ్యాలను తెలివి తేటలను సరైన రీతిలో వినియోగించుకోవాలి. అనుకూల ఆలోచనలతో ముందుకు పోవాలనే ఉద్దేశంతో ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రత్యేక వ్యక్తిత్వవికాస కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కాకినాడ ఇస్కాన్ స్వామీజీ శ్రీ అనంత శేష దాసు ప్రభువుజీ మాట్లాడుతూ విద్యార్థి యువత పుస్తకాలతో మేధస్సును పెంపొందించు కోవడంలో సమయాన్ని కేటాయించాలని, గీతా పఠనం సర్వ శ్రేష్కరమని, యువతలో అనుకూల ఆలోచన నింపుకోవడానికి, తమ లక్ష్యాలను సాధించడానికి భగవద్గీత పఠనం చేయాలని అన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను కృష్ణాష్టమి వేడుకలకు ఆహ్వానించారు. ప్రతి ఆదివారం సేవా కార్యక్రమాలకు విచ్చేస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఇస్కాన్ ప్రభుజికి ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి,డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి,అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ,ఇంచార్జ్ మూర్తి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు టి తేజేశ్వరరావు, డి.అశ్విని మరియు వాలంటీర్లు పాల్గొన్నారు.

# సహోద్యోగి వైద్య చికిత్సకు జైలు సిబ్బంది ఔదార్యం


**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్. రాహుల్ ఆధ్వర్యంలో, సెంట్రల్ జైలు అధికారులు మరియు సిబ్బంది మానవీయ విలువలు, ఐక్యతకు నిదర్శనంగా ముందుకు వచ్చారు. జైలు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న హోమ్ గార్డ్ ఎన్. విజయ్ కుమార్ గొంతు క్యాన్సర్ చికిత్స కోసం స్వచ్ఛందంగా రూ. 1,19,000/- (ఒక లక్ష పత్తొమ్మిది వేల రూపాయలు) సేకరించి అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఎస్. రాహుల్ మాట్లాడుతూ, "బాధలో ఉన్న సహోద్యోగికి చేయూతనివ్వడం ప్రతి ఒక్కరి మానవీయ బాధ్యత. ఇలాంటి సేవా కార్యక్రమాలు సిబ్బందిలో ఐక్యతను, పరస్పర నమ్మకాన్ని పెంపొందిస్తాయి" అని పేర్కొన్నారు. జైలు సిబ్బంది ఈ చర్య సహానుభూతి, ఔదార్యానికి ప్రతీకగా నిలిచిందన్నారు. సహచర ఉద్యోగుల చేయూత నివ్వడం పట్ల విజయ్ ధన్యవాదాలు తెలియ చేశారు. ఈ సందర్భంలో



పర్యవేక్షణాధికారి ఎం. రాజ్ కుమార్, గార్డింగ్ సిబ్బంది సతీష్, సురేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# 'ఆదిత్య'లో ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం




కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక సాంబమూర్తినగర్‌లో గల ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాలలో ఆగష్టు 10వ తేదిన ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగించారు.

ఈసందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి.కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా॥బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంతంగా జీవ ఇంధనాల వాటా 2022-27 మధ్యకాలంలో 5.4 శాతంగా ఉంటుందని శాస్త్రవేత్తల అంచనా. శిలాజ ఇంధనాల స్థానంలో లేదా శిలాజ ఇంధనాలతో పాటు కొంతశాతం జీవ ఇంధనాలను ఉపయోగించొచ్చు. ఇవి కాలుష్యాన్ని తగ్గించేందుకు దోహదం చేస్తాయి అని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ ప్రస్తుతం వాహనాల్లో ఇంధనాలుగా ఉపయోగిస్తున్న డీజిల్, పెట్రోల్ మొదలైన శిలాజ ఇంధనల స్థానంలో వీటిని వినియోగించవచ్చు. అత్యంత తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే పునరుత్పాదక శక్తి వనరుగా బయోఫ్యూయల్స్‌ను పేర్కొంటారు అని ఆమె తెలియజేశారు. ఈ సందర్భంగా ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థినులు జీవ ఇంధనం యొక్క ఉత్పత్తి మరియు వినియోగం కోసం అందరికి తెలియజేయాలని ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల నుండి డైరీఫామ్ కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ ఎమ్.శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.నవ్య, ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్లు మరియు అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

## పెరవలి మండల పరిషత్ సిబ్బంది ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా



**పెరవలి, మేజర్ న్యూస్ :** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 10వ తేదీ ఆదివారం పెరవలి మండలంలో ఎంపీడీవో కార్యాలయం నుండి భారీ ర్యాలీ నిర్వహించారు,సదరు ర్యాలీలో పెరవలి మండల ఇన్చార్జ్ ఎంపీడీవో ఘంటా శ్రీనివాస్, ఎగువ శ్రేణి సహాయకులు కే ఎన్ శంకర్, తాసిల్దార్ కార్యాలయం వారి సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, మండల విద్యాశాఖ అధికారి బి స్వరూప్, డ్వాక్రా సిబ్బంది, ఏఈపిఆర్ వారి సిబ్బంది మరియు మండల స్థాయి అధికారులు, పాల్గొన్నారు.

## అన్నవరం బ్రిడ్జి నిర్మించి సంవత్సరం కాకముందే కుప్ప కూలిన వైనం



**కూనవరం, మేజర్ న్యూస్ :** విఆర్ పురం నుండి చింతూరు వెళ్లే మార్గమధ్యంలో అన్నవరం గ్రామ సమీపాన గత సంవత్సరం సుమారు 70 లక్షల రూపాయలు వ్యయంతో నిర్మించిన బ్రిడ్జి గత రాత్రి కురిసిన వర్షాలకు కూలిపోయింది. వి ఆర్ పురం చింతూరు 40 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి కాంట్రాక్టర్లకు అన్నవరం బ్రిడ్జి నిర్మాణం ఆదాయ వనరుగా మారింది. ప్రతి సంవత్సరం బ్రిడ్జి రిపేర్లు కోసం ప్రభుత్వం లక్షల రూపాయలతో నిధులు మంజూరు చేసి రిపేర్లు నిర్వహించేవారు. గత సంవత్సరం పాత బ్రిడ్జి పక్కన నూతనంగా సిమెంటు వరలతో బ్రిడ్జి నిర్మాణం చేశారు. అయితే శనివారం రాత్రి కురిసిన వర్షాలకు కొండవాగు ఉదృతంగా ప్రవహించి బ్రిడ్జిని డ్యామేజ్ చేయడంతో కూలిపోయి సంఘటన వెలుగులోకి వచ్చింది బ్రిడ్జి నిర్మాణంలో కాంట్రాక్టర్లు అధికారులపై చర్యలు తీసుకొని తక్షణం నిర్మాణం చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు అధికారులు కోరుతున్నారు.


## కానూరు సొసైటీ అధ్యక్షులుగా వాకలపూడి వీర్రాజు



**పెరవలి, మేజర్ న్యూస్ :** కానూరు విశాల సహకార పరపతి సంఘానికి నూతన అధ్యక్షుడిగా వాకలపూడి వీర్రాజును నియమించారు. ఈ మేరకు జిల్లా సహకార అధికారి వారి ఉత్తర్వులు వెలువడినట్లు కానూరు గ్రామ తెదేపా అధ్యక్షుడు ముల్లపూడి రాజేంద్రప్రసాద్ ఆగస్టు 10వ తేదీ ఆదివారం మేజర్ న్యూస్ కు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ ఏర్పడిన నాటినుండి ఒక కార్యకర్తగా, గ్రామ కమిటీ అధ్యక్షుడిగా, జిల్లా రైతు కార్యవర్గ సభ్యుడిగా, కానూరు గ్రామపంచాయతీ ఉప సర్పంచగా, సర్పంచ్ గా, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు గా, క్లస్టర్ కన్వీనర్ గా,సేవలందిస్తూ వస్తున్న వాకలపూడి వీర్రాజు కూటమి నాయకుల సహకారంతో నిడదవోలు శాసనసభ్యులు రాష్ట్ర మంత్రివర్యులు కందుల దుర్గేష్ మరియు ఏపీ ఎస్ఎస్డిసి చైర్మన్ బూరుగుపల్లి శేషారావు ఆశీస్సులతో కానూరు కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులుగా నియమితులు అయ్యారని రాజేంద్రప్రసాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా వాకలపూడి వీర్రాజుకి కానూరు గ్రామానికి చెందిన కూటమి నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఏజెన్సీలో మహిళా ఉద్యోగిని కిడ్నాప్ కేసులో నిందితులు అరెస్ట్





**– డి.ఎస్.పి సాయి ప్రశాంత్ వెల్లడి**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో ఈ నెల 7వ తేదీన కిడ్నాప్ గురైన సచివాలయం ఉద్యోగిని సౌమ్య కేసును పోలీసులు వేగవంతమైన పోలీసు గాలింపు చర్యలతో ఛేదించి, అపహరణకు గురైన బాధితురాలిని సురక్షితంగా రక్షించారు. రంపచోడవరం డిఎస్పీ జి.సాయి ప్రశాంత్ ఆదివారం రాత్రి విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలు తెలియపరిచారు.

07-08-2025 ఉదయం 10:34 గంటలకు, దేవీపట్నం మండలం, శరభవరం గ్రామ సచివాలయం వద్ద, ప్రధాన ముద్దాయి కశింకోట అనిల్ కుమార్ (ఎ1) అతని నలుగురు సహచరులు గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ మరియు ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న సోయం శ్రీ సౌమ్యను, ఆమె ఇష్టానికి విరుద్ధంగా వివాహం చేసుకోవాలనే ఉద్దేశంతో, ఇన్నోవా కారు (ఎపి 31 టిజె 1462) లో అపహరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు వెంటనే అపహరణ ప్రోటోకాల్‌ను అమలు చేసి, ముఖ్యమైన మార్గాలను మూసివేసి, చెక్ పోస్టులకు అలర్ట్ ఇవ్వడం, సమీప జిల్లాలకు సమాచారం అందించడం వంటి చర్యలు చేపట్టారు. జిపిఎస్ ట్రాకింగ్, సీసీ టీవీ విశ్లేషణ ద్వారా, మల్లిసాల ఆలయం వద్ద వాహనం మార్పు సహా, నిందితుల కదలికలను గుర్తించారు. తక్షణ సమాచార సేకరణ, సిడిఆర్ విశ్లేషణ ద్వారా ఇద్దరు స్థానిక సహకారులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే నిందితులు నిర్వహించిన ఆర్థిక లావాదేవీలను కచ్చితంగా అన్వేషించడం, ఇతర సాంకేతిక ఆధారాలు సేకరించడం ద్వారా, వారి దాచుకున్న ప్రదేశాలను గుర్తించగలిగారు. క్రిందిస్థాయిలో నిరంతర ఆపరేషన్లు, విశాఖపట్నం, రాజమండ్రి పోలీసులతో సమన్వయం కలిగి, వారి ఉన్న ప్రదేశాలను ఖరారు చేశారు. కాగా 10-08-2025 మధ్యాహ్నం 2:00 గంటలకు, ప్రత్యేక పోలీసు బృందం వై. రామవరం మండలం గుర్తేడు వద్ద నిందితుడు కసింకోట అనిల్ కుమార్‌తో సహా మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని, బాధితురాలిని సురక్షితంగా రక్షించారు. అరెస్టు అయిన ప్రధాన ముద్దాయిలు కశింకోట అనిల్ కుమార్, వయస్సు 32 సంవత్సరాలు, వేటుకూరు గ్రామం, మారేడుమిల్లి మండలం. ఉమామహేష్, వయస్సు 24 సంవత్సరాలు, రామవరం గ్రామం, జగ్గంపేట మండలం. రాగోలు దుర్గా విగ్నేష్, 21 సంవత్సరాలు, మండపేట గ్రామం ఉన్నారని తెలిపారు. కాగా బాధితురాలు సమాచారం తెలియజేస్తూ అపహరణకు సహకరించిన ముద్దాయిలు నర్సాపురం గ్రామ శివారులో అరెస్ట్ చేసారు. వారిలో మాడే మణి మోహన్ దొర, 26 సంవత్సరాలు, పోతవరం గ్రామం, దేవీపట్నం మండలం 5. ఎ7 పూసం పవన్ కుమార్, 33 సంవత్సరాలు, పోతవరం గ్రామం, దేవీపట్నం మండలం ఉన్నారు. అనంతరం ఎ6 మరియు ఎ7ను అరెస్టు చేశారు. ఇంకా ఎ4 మరియు ఎ5 ఇంకా పరారీలో ఉన్నారని తెలిపారు. ప్రాథమిక దర్యాప్తులో, ఎ1కు కసింకోట అనిల్ కుమార్‌కు పలు ఎన్‌డిపిఎస్ కేసులు సహా క్రిమినల్ చరిత్ర ఉన్నట్టు, మరియు అతను అలవాటు నేరస్థుడని తేలిందన్నారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం పోలీసుల ప్రధాన లక్ష్యమని, బాధితురాలు ఈ ఘటనలో తనపై ఎటువంటి పెద్ద లైంగిక దాడి జరగలేదని ధృవీకరించిందన్నారు. మిగిలిన నిందితులను త్వరితగతిన పట్టుకుని, న్యాయం త్వరగాచేయడానికి దర్యాప్తు కొనసాగుతోందని డిఎస్పీ సాయి ప్రశాంత్ వెల్లడించారు. అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, బాధితురాలి సురక్షిత రక్షణలో వేగంగా, సమన్వయంతో పనిచేసిన రంపచోడవరం డి.ఎస్.పి వారి బృందాన్ని అభినందించారు. ఈ కేసు మహిళల భద్రత కోసం ఆధునిక సాంకేతికత, సమన్వయం, కట్టుదిట్టమైన కట్టుబాట్లతో పనిచేస్తున్న ఏపి పోలీసులు కృషి చేశారన్నారు. మహిళను కిడ్నాప్ చేసినట్లు సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో దృశ్యాలు ఈ కేసుకు సంబంధించినవి కావని డిఎస్పీ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని డిఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో రంపచోడవరం సిఐ సన్యాసినాయుడు, అడ్డతీగల సిఐ నరసింహామూర్తి, గంగవరం ఎస్సై వెంకటేష్, దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ కోసం "ఆల్ ఈజ్ వెల్" సభ్యుల శ్రమదానం



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** స్థానిక జెఎన్‌టియుకెలో ఆల్ ఈజ్ వెల్ సభ్యులచే మొక్కలు నాటడం మరియు మొక్కలను సరిచేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాకినాడ ఐడిఎ కార్యదర్శి మరియు ఆల్ ఈజ్ వెల్ సభ్యులు అయిన డా.అడ్డాల మాట్లాడుతూ చెట్లు నాటడం అనేది పర్యావరణాన్ని మరియు సమాజాన్ని మెరుగుపరచడానికి ఒక గొప్ప మార్గమని, ఇది గాలిని శుభ్రపరచడం, ఉష్ణోగ్రతలను నియంత్రించడం మరియు ఆరోగ్యకరమైన సమాజంను నిర్మించడంలో సహాయపడుతుందని తెలిపారు. చెట్లు గాలిని శుద్ధి చేస్తాయని, నీటిని నిలుపుకుంటాయి మరియు నేల కోతను నివారిస్తాయని, ఇవన్నీ పర్యావరణ వ్యవస్థ యొక్క సమతుల్యతను కాపాడటానికి సహాయపడతాయని అన్నారు. వారంలో ప్రతీ ఆదివారం మూడు గంటల పాటు పర్యావరణ పరిరక్షణ కోసం శ్రమదానం చేస్తున్నామని తెలిపారు. జెఎన్‌టియు వైస్ చాన్సలర్ డా.ప్రసాద్ మరియు ఉదయ్ భాస్కర్‌ల సహకారంతో జెఎన్‌టియుకె సుందరీకరణకు ఈకార్యక్రమం పెద్దఎత్తున చేపట్టామని అన్నారు. ఆల్‌ఈజ్ వెల్ సభ్యులు కిషోర్ మాట్లాడుతూ చెట్లు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని సృష్టిస్తాయని, అవి ప్రజలకు ఆహారం, నీడ అందిస్తాయని, చెట్ల పెంపకం కార్యక్రమాలు సమాజ సభ్యుల మధ్య ఐక్యతను పెంపొందించడానికి సహాయపడతాయని, మా సభ్యులంతా కలిసి పనిచేయడం ద్వారా ఈ మహత్తర లక్ష్యాన్ని సాధించగలమని, కళాశాల ప్రాంగణాలలో చెట్ల పెంపకం విద్యార్థులకు పర్యావరణం గురించి అవగాహన కల్పించడానికి సహాయ పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు, ప్రసాద్, రవివర్మ, వెంకట నారాయణ, కృష్ణారావు, స్వామి, సూర్య, డా.రాజ్ కుమార్, రాజేంద్రరెడ్డి,కేశవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ కాకినాడ ఎలైట్ ఆధ్వర్యంలో మిషన్ల పంపిణీ



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ లైన్స్ క్లబ్‌లో సుమారు 30 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు కందాల రవి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పెదపాటి అనసూయ, వారి కుటుంబ సభ్యులు అందించిన రెండున్నర లక్ష రూపాయలు విరాళంతో కుట్టు మిషన్లు శిక్షణ పొందిన మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎం.ఎస్.ఆర్.వి.సత్యనారాయణ జోన్ చైర్ పర్సన్, జిల్లా గవర్నర్, పూర్వ జిల్లా గవర్నర్ ముంజలూరి విశ్వేశ్వరరావు, ఈశ్వర్ కుమార్, భారీ స్థాయిలో లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. దాతలను సాలువతో ఘనంగా సన్మానించి తిరుపతి లడ్డు, అప్పడం దాతలకు అందజేశారు.

## ప్రమాదవశాత్తు చెట్టు పైనుండి పడి దింపు కార్మికుడు మృతి



**ఆత్రేయపురం,మేజర్ న్యూస్ :** మండలంలోని వసంతవాడ గ్రామానికి చెందిన కారంకి వీర వెంకట సత్యనారాయణ గౌడ (42) అనే అతను ఆదివారం ఉదయం పని నిమిత్తం రామిరెడ్డి వీరభద్ర అనే రైతు వద్ద కొబ్బరి దింపు పనికి వెళ్లి కొబ్బరికాయలు దింపు తీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టు పైనుండి జారి పడిపోవడం వలన తగిలిన గాయాల వల్ల కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అతనికి వివాహమై ఒక బాబు ఉన్నాడు. దీనిపై తమ్ముడు కారంకి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై ఎస్.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అసాంఘిక కార్యకలాపాలపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** మురారి పంట పొలంలో వేంచేనియున్న దుర్గమ్మ అమ్మవారి ఆలయానికి ప్రతి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు వారి వారికి మొక్కులు తీర్చుకునేందుకు వస్తున్న దృశ్య దానిని దృష్టిలో ఉంచుకుని జగ్గంపేట సీఐ వై ఆర్ కె, శ్రీనివాస్ ఆదేశాలతో గండేపల్లి ఎస్ఐ శివ నాగ బాబు ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు అమ్మవారి ఆలయ చుట్టుపక్కల ప్రాంగణంలో ఆసాంఘిక కార్యకలాపాలపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. బహిరంగ మద్యం, బహిరంగంగా పొగ తాగుట, పేకాట గుండాట వంటి కార్యకలాపాలు నిషేధిస్తూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందని వై ఆర్ కె శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

అంతేకాకుండా దొంగతనం అరికట్టేందుకు, భక్తుల సౌకర్యార్థం ప్రతి ఆదివారం గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన, భక్తులకు అసౌకర్యం కల్పించిన చట్టరీత్యా హెచ్చరించారు.